కథ

# స్నేహానికి నిదర్శనం





తూర్పు తీరం నుంచి ఉషాకిరణాలు అవని అంచులు తాకుతున్నాయి అప్పుడప్పుడే. చుట్టూ మంచుపొగలు కమ్ముకుని ఉన్నాయి. ఆ పొగలు బాల భానుడి వేడికీ, అందానికి ఆకర్షితమయ్యి అతనిలో ఐక్యం అవుతున్నట్లు కొద్ది కొద్దిగ మాయం అవుతున్నాయి. ఆ ఉదయపు వేళ దేనికోసమో వెదుకుతూ ఎదురు చూస్తున్నాయి రెండు నయనాలు. ఒక్కసారిగా ఆ కళ్ళల్లో మెరుపులీనమైనట్టు తళతళా మెరిసిపోతున్నాయి. దానికి కారణం ఒక్కటే తను ఎదురుచూసే రూపం తన ముందుకు అపరంజి బొమ్మలా, అద్భుత శిల్పంలా కదిలొస్తున్నందుకు.

కాని మనసులో ఏదో ఆందోళనగా వుంది 'ఉదయ్'కి. కాళ్ళు చేతులు ఎందుకో అప్రయత్నంగానే వణుకుతున్నాయి. కారణం వణికించే చలైనా కావచ్చు లేక ఆ కదిలొచ్చే శిల్పం 'ఉష' అయినా అయ్యి ఉండవచ్చు. ఉదయ్ కళ్ళు నింగిని నింపుకున్నట్లు నీలంగా మారిపోయాయి. ఆమె తనవైపు చూసినపుడు సంద్రంలో మునిగి తేలుతున్నట్లు ఉక్కిరిబిక్కిరి అయినట్లు శ్వాస బిగపడుతుంటాడు.

కూనాబత్తుల సుబ్రమణ్యం

"నీ కళ్ళను చూస్తే నా హృదయం అనంతంలోకి జారుతున్నట్లు వుంటుంది" అని ఎన్నో సార్లు ఉషకు చెప్పాలనుకుని మనసు మూగబోయి మాటలు రాక మౌనంగా ఉండిపోయాడు. అది చెప్తే ఇంకోటి, మరోకటి చెప్పాలనిపిస్తే అలా చెబుతూ వెళ్ళిపోతే చివరకు నిశ్చల స్థితిలోనే ఉండవలసి వస్తుందని... ఆమెను చూడగానే కలిగే భావనలు తలుచుకుంటే అవి నిశ్శబ్దంగా గుప్పెడు గూటిలో ఇంకిపోయేవి. మది మదికీ ఆశలుంటాయి అవి ఆనందంతో అలల్లా ఎగిసిపడి పెదవుల చివర కదలికల్లో విరిగిపడతాయి అనుకుంటే అది ఆమె తప్ప మరెవరూ కనిపించనప్పుడే!




కాని ఆమె కదలికలు, బావ ప్రకటనలు అన్నీ మంచులా స్వచ్ఛంగా తెలిగ్గా, తామరాకు మీద నీటిబొట్టులా మృధువుగా ఉండేవి. కోపం, అలసట పోవాలనుకుంటే కళ్ళు మూసుకుని ఆమెరూపం తలుచుకుంటే హృదయ సాగరంలో మునిగినట్టు హాయిగా, స్వచ్ఛంగా ఉంటుంది.

తను ఎందరిలో వున్నా అతని కళ్ళు ఆమెను చూడకపోయినా మనసు మాత్రం వెదుక్కుంటూ ఆమె వైపే పరుగులెట్టి ఆ అపు'రూపాన్ని' చేరుతుంది. కాని అది ఒక్క క్షణం మాత్రమే. ఆ క్షణకాలాన్ని నిలుపుకోవడానికే సంవత్సరాలు పట్టింది.

ఆమె ముందుకు రాగానే మాట్లాడాలనుకున్నా పెగలనంటున్న, మూగబోయిన నోటిని బిగపట్టి అరిచినా లాభం లేదు. ఆ మౌనం రేపే ప్రకంపనలు మదిని నిద్రలేపితే ఆ వేడికి కరిగి కన్నులగుండా ప్రవహించి చెక్కిలి మీద నుండి జారి హృదయ గతుల్ని తాకేవి. ఇంతలోనే ఆమె దాటిపోయేది. ఆ ప్రకంపనలు తెచ్చే భావనలు ఎంత మధురమో! ఆ అనుభూతుల్లో ఎంత ఆనందమో! అని అనుకుంటూ వణుకుతున్న పెదాలపై ఓ నవ్వు విరిసింది దానికి సాక్ష్యంగా. ఆ నవ్వుని ఎవరైనా చూస్తారేమోనని దాన్ని గుండెలోనే దాచేశాడు.

ఎప్పుడూ లేనిది ఏమిటీ వింత? ప్రాయమో మరి గాయమో మనసుని సుతిమెత్తని కత్తితో కోస్తుంటే, గుండె చాటు దాగున్న మౌనానికి, రెప్పపాటు పొంచివున్న ఆనందానికి కారణం ఏమై ఉంటుంది అని ఆలోచిస్తూనే పరిచయం లేనివాళ్ళ గురించి కలవరింతలు, పులకరింతలు ఏమిటీ అని ఎక్కడి నుంచో మనసు రోధన చేస్తున్నా ఆ ధ్యాసే నిండివుంది మదిలో. ఆమె ఎవరో తెలీదు, ఎక్కడ్నుంచి వస్తుందో తెలీదు. పచ్చని పూల చెట్ల నీడల్లోంచి అందమైన రాజహంస అడుగులు మోపుతూ అడ్డొచ్చిన పూలను తన పాదాలపై తొక్కడం ఇష్టం లేక పక్కకు జరుపుకుంటూ అలంకరణలు ఏమీ లేకపోయినా, విరబూసిన జుట్టుతో, ఒక మామూలు చీరలో నడుస్తూ వెళ్లేది. అక్కడే బస్సుకోసం ఎదురు చూస్తూ ఉండేవాడు ఉదయ్. ఆమె వెళ్ళే వరకు అలానే చూస్తూ ఉండేవాడు.

ఆమె రూపం చూస్తే అపరంజిలా, పాలరాతి శిల్పంలా ఉంటుంది. ఎంతటివారినైనా చల్లబరిచే ఆ వెన్నెల చిలికే కళ్ళు, చిరునవ్వులొలికే దరహాసం. ఆ దారిలోని పూలన్నీ బాధపడుతుంటాయి. ఎందుకంటే ఆ మృదువైన పాదాలని తాకే అదృష్టం తమకు దక్కలేదే అని. ఆ రూపంలో ఎందుకంత గాఢతో తెలియదు అతనికి. చూపులతోనే ఆర్తిగా హత్తుకున్నట్లు ఉంటుంది.

సాధారణ ఉద్యోగస్తుడు, స్వతహాగా బుద్ధిమంతుడు ఏ రకమైన చెడు వ్యసనాలు సహవాసాలు లేనివాడు. పాపం బంధువులందరూ రైలు ప్రయాణంలో మరణిస్తే ఒక్కడే ఒంటరి జీవనం సాగిస్తున్నాడు. పెళ్ళి చేసుకోవాలనే ఆలోచన వున్నా అది ఎరేంజ్‌డ్ పెళ్ళి చేసుకోవాలని, తన మనసుకు నచ్చి, తన భావాలు మెచ్చే వ్యక్తి కోసం ఎదురు చూస్తున్నాడు. ఇప్పటివరకు ఎందరినో చూశాడు. ఇలాంటి భావనలు వచ్చి ఎరుగవు. ఇది కొత్త అనుభూతిలా మొదలైంది అతనిజీవితంలో. ఇది ఏమి మాయా మరి అతనికి అర్థం కావడం లేదు. ఆమె ఎవరో తన జీవితంలోకి ఎందుకు వచ్చిందో తెలీదు. అసలు తనలో ఏమి జరుగుతుందో అతనికే అర్థం కాని పరిస్థితుల్లో వున్నాడు.

రోజూ పరీక్షించిన కళ్ళు ఆ రోజూ ఎదురు చూస్తున్నాయి. మూడు బస్సులు దాటినా వెళ్ళలేక, వెళ్ళడానికి మనసురాక అలానే చూస్తూ ఉన్నాడు. ఆమె ఇంకా రావడం లేదు. ఈరోజు వర్క్ మానేసి మరీ ఎదురు చూస్తున్నాడు. జనాలందరు గజిబిజిగా, బిజీబిజీగా ఎవరి దారిన వారు గబగబా ఉరుకు పరుగులతో వెళ్ళిపోతున్నారు. అప్పుడనుకున్నాడు. "ఎదురు చూసే కళ్ళకు నీరసం ఉండదు, మనసుకు అలసట ఉండదు" అని. అది ఎంత మధురమో అర్థమైంది. కాని గంటలు గడిచే కొద్దీ అదెంత బాధాకరమో చూసి చూసి కళ్ళు లాగుతుంటే, తిప్పి తిప్పి మెడ నెప్పెడుతుంటే తెలిసింది.

ఇంక ఓపిక నశించి బయలుదేరుదామని నిర్ణయించుకుని పైకి లేవబోతుంటే ఆమె రోడ్డు మలుపు దాటి నడుస్తూ వస్తుంది. ఉదయ్‌లో వేయి రాగాలు ఒక్కసారిగా వినిపించినట్టు, కోటి వీణలు గుండెల్లోని భావాల్ని మీటినట్టు మురిసి పోతున్నాడు. గుండె సవ్వడి మాత్రం ఒకటికి రెండింతలయ్యి కొట్టుకుంటుంది. అలాగే నిలబడి ఆమె వైపు చూస్తుండిపోయాడు.

ఆమె కళ్ళలోని ఆశను, ఆరాటాన్ని చూస్తూనే ఉదయ్‌ని దాటివెళ్ళి పోయింది. పలకరించాలి అనుకొని మాట రాక పోయినా గొంతు పెగల్చి 'హలో' అన్నాడు. ఆ పిలుపు కోసమే అన్నట్లు ఆగి వెనుదిరిగి ఏమిటీ అన్నట్టు కనుసైగ చేసింది. మిమ్మల్ని ఇంచుమించుగా 6 నెలలుగా చూస్తున్నాను. మీరు ఎవరు? మీ పేరు ఏమిటి? అని అడిగే లోపే అర్థం అయ్యా, అవ్వ నట్టుగా తలూపి నేను కూడా అంతే అన్నట్లు ఆ మందహాసంలో ఓ చిరునవ్వుమాత్రమే విరిసింది. అప్పుడర్థమైంది బ్రహ్మ సృష్టిలో ఎన్ని వింతలో అతనికి. అసలు విషయం మరిచి అలాగే చూస్తున్నాడు. ఏమి కావాలి అన్నట్టు ప్రశ్నార్థకంగా చూసింది. అప్పుడు తికమకపడిపోయాడు ఉదయ్. అసలే మెతక ఆపైన ఆడవారితో ఎలా మాట్లాడాలో సరిగా తెలీదు. ఏమి మాట్లాడాలో ఎలా మాట్లాడాలో అర్థం కాక ఏదో చెప్పాలని ఒక్కసారిగా ఇలా చెప్పేశాడు. "మీరు నాకు చాలా బాగా నచ్చారు" మీతో పరిచయం పెంచు కోవాలనుకుంటున్నాను అని గబగబా చెప్పేశాడు. కాని ఈ లోపే ఓ చిర్నవ్వునవ్వి వెళ్ళిపోయింది. ఆ నవ్వుకి అర్థం తెలియక అవమానంగా అనిపించింది ఉదయ్‌కి.

ఎంతోమందిని చూసినా చెక్కు చెదరని మనసుతో బుద్ధిమంతుడుగానే వున్నాడు. తను ఇప్పుడే అమ్మాయి అదీ ఎవరో తెలియని అమ్మాయి గురించి పడి పడి వేచి చూడటం ఏమిటీ? ఆమె కోసం, ఆమెతో మాట్లాడటంకోసం ఆరాటపడటం ఎందుకు? ఆమె మాత్రం ఐశ్వర్యరాయ్‌లాగా ఓ నవ్వు నవ్వి వెళ్ళిపోవడమేమిటి! దీనికంతటికీ తనకు కలిగే భావనలు ఆమెకూ కలుగుతాయని అనుకోవడమే

కారణం అని విసుక్కుంటూ అప్రయత్నంగా వస్తున్న కన్నీటికి తుడుచుకుంటూ కోపంతో ఆటోలో ఇంటికి వెళ్ళిపోయాడు.దానిగురించే వారంరోజులు ఆలోచిస్తూ ఉండిపోయాడు. చివరికి ఒక నిశ్చయానికి వచ్చాడు.

ఈరోజు ఎలాగైనా ఆమె విషయం తెల్సుకోవాలి అనుకుని అదేస్టాపులో నిల్చుని వున్నాడు. రోజూలాగే ఆమె కనిపించింది. దగ్గరగా వెళ్ళి చూడండీ! నా పేరు ఉదయ్, నేను ఎల్.ఎల్.బి అనే కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాను. నాకు నేనుగా మీతో మాట్లాడడానికి వచ్చానని, పరిచయం చేసుకోవాలనుకున్నానని నేను మీకు ఒక జులాయిలాగా కనిపించి వుండవచ్చు. కాని నేను అలాంటి నీచ స్వభావమున్న వాణ్ణి కాదు. "ఆత్మీయులతో మాట్లాడకుండా ఉండటం ఎంత కష్టమో,శత్రువులతో మాట్లాడాలన్నా అంత కష్టం". మీరు నావైపు రోజూ పరిచయ పూర్వకంగా చూస్తున్నారు కాబట్టి ఆడవారు కదా మొహమాటపడుతున్నారేమో అని పలకరించిన మాట నిజమే. కాని దానికి మీరు వింతగా ప్రవర్తించడం నాకు నచ్చలేదు అని అలా మాటలను తూటాల్లాగ గబగబా వదిలేస్తున్నాడు ఉదయ్. అతనంతలా మాట్లాడుతున్నా ఆమె నోటివెంట ఒక్కమాట కూడా రాలేదు.మళ్ళీ అదే చిరునవ్వు. అదే దరహాసం. మళ్ళీ కలుద్దాం అన్నట్టు చెయ్యూపి నడుస్తూ వెళ్ళిపోయింది.

ఆ క్షణం నుంచి తేరుకోవడానికి నిముషం పట్టింది ఉదయ్‌కి. ఏమిటీ ఈ మనిషితత్వం ? అసలు మామూలు మనిషేనా ? లేక మతి చెలించిన మనిషా ? లేకపోతే మాటలు రావా? లేదా నాతో పరిచయం ఇష్టంలేక ఇలా ప్రవర్తిస్తుందా ? అని రకరకాల ప్రశ్నలతో మెదడు మారుమ్రోగుతుంటే అలాగే ఇంటికి వచ్చేసి జరిగిన దాన్ని గుర్తు చేసుకుని ఆమెను తిట్టుకుంటూ ఇక ఆమె గురించి ఆలోచించడం టైమ్‌వేస్ట్ అనుకొని భోజనం కూడా చెయ్యకుండా పడుకున్నాడు.

కాని నిద్రలో కూడా ఆమె కళ్ళు, ఆమె నవ్వు మళ్ళీ మళ్ళీ గుర్తుకొస్తూ మనశ్శాంతిని కరువు చేస్తున్నాయి. కళ్ళు మూతపడినా కనుపాపలకు నిద్రరాక భాష్పాల జల్లు బలవంతంగా నయనాల నుండి జారి మందహాసాన్ని తడిపేస్తున్నాయి. ఏమిటీ ఆ చూపులకు, ప్రవర్తనకు అంత బేధం ఎందుకో అని ఊహించుకుంటూ అసలు విషయం గురించి ఆలోచించవద్దు అని నిర్ణయించుకుని మరుసటిరోజు ఆఫీసుకు బయలుదేరాడు. ఆ బస్టాప్ దగ్గరకొచ్చేసరికి మనసు అదోరకంగా మారింది. నడక సాగించనని కాళ్ళు మారం చేస్తున్నాయి. తనప్రమేయం లేకుండానే అక్కడ కూర్చుండిపోయాడు. ఆరోజే ఆఖరు అనుకుని ఎదురు చూస్తున్నాడు. ఎంతసేపు ఎదురు చూసినా ఆమె రావడం లేదు. అలా గంటలు గడిచినా అలానే కూర్చున్నాడు. ఇక వెళ్ళిపోదాం అనుకుని లేవబోయేంతలో ఒక చిన్నపిల్ల పరిగెత్తుకు వచ్చి తన ముందు ఆగింది.

అంకుల్ ఇదుగోండి ఈ లెటర్ మీకివ్వమని ఒక ఆంటీ ఆ మూలవరకు వచ్చి మిమ్మల్ని చూపించి చెప్పింది. అని ఆ లెటర్‌ని చేతిలో పెట్టి వెళ్ళిపోయింది. ఏమిటి ! నిన్నేమో చిలిపినవ్వు నవ్వి వెళ్ళిపోయింది. ఈ రోజు లెటర్ పంపించింది. ఏమి రాసుంటుందని ఆత్రుతగా తెరిచి చూశాడు. అక్షరాలు చూస్తేనే ఆమె మనసు అర్థం అయ్యేలా వున్నాయి. తారలను కూర్చినట్టు, వజ్రాలను వరుసగా పొదిగినట్టు ఎంతో చూడముచ్చటగా ఉన్నాయి.

మీ చూపులు, మీ ఆత్రుత, మీ భావనలు అర్థం చేసుకోలేని అమాయకురాలిని కాదు. మిమ్మల్ని చూస్తుంటే దివికొచ్చే ఉషస్సులా అనిపిస్తారు. "చూపు లేనివాడికి వసంతమైనా, కారు చీకటైనా ఒక్కటే". మిమ్మల్ని మోసం చేయడం నాకిష్టం లేదు. నా పరిచయం కోసం మీరెంత ఆశపడుతున్నారో నేనూ మీ పరిచయం కోసం అంత ఆశ పడుతున్నాను. ఒక్క విషయం "విధి ఆడిన వింత నాటకంలో ఆ విధికి బలైన దాన్నినేను. చేయని పాపానికి శిక్ష అనుభవిస్తున్నాను. ప్రమాదం నా పాలిట శాపంగా మారింది. రక్తం అవసరం అయితే జన్మనిచ్చిన తండ్రిలో కల్మషం, కల్తీ వుండదని, డాక్టర్ల నిర్లక్ష్యం వల్ల పరీక్ష చేయని రక్తం ఎక్కించారు. ఆ రక్తం వల్ల నా ప్రాణం నిలబడింది కాని నా ప్రాణాన్ని బలిచేసే ఎయిడ్స్ వ్యాధి ఆ రక్తంలో దాగుందని నాకు కొన్ని రోజులకే తెలిసింది. పుట్టుకతోనే తల్లిని పోగొట్టుకుని ప్రమేయం లేకుండా ఈ వ్యాధి బారిన పడి మీరున్న ప్రాంతానికి దగ్గర్లో వున్న హాస్పిటల్‌నందు చికిత్స పొందుతున్నాను. నేరం చేయకపోయినా తప్పు మనదే అని చచ్చిన శవాన్ని కూడా దూషించి, హింసించి కాకుల్లా పొడిచే ఈ కళ్ళు లేని కుళ్ళు సమాజంలో అభిమానాలు, అనురాగాలు ఏమీ లేవనుకుని ఇక వద్దనుకుని బ్రతుకుతున్న దాన్ని.

అనుకోకుండా ఈ వెన్నెలదారిలో మిమ్మల్ని చూసిన నేను డాక్టర్ని పర్మిషన్ అడిగి అలా రోజుకొక సారి మార్నింగ్ వాకింగ్‌కి వస్తున్నాను. అదీ ఎన్నో నిబంధనలతో. మంచి సంగీతాన్ని ఆస్వాదిస్తాం, అందాల్ని వీక్షిస్తాం. అలాగే నేను మిమ్మల్ని చూస్తుంటాను. అంతే నన్ను పలకరించడానికి గాని, పరిచయానికి గాని ప్రయత్నించవద్దు. ఈ విషయం తెలిశాక మీకు నా మీద ఏదో అసహ్యాభావం కలిగి వుండవచ్చు. రోజూ కనిపించే ఆ చూపులో ఆ భావం చూసి నేను తట్టుకోలేను. అందుకే ఇక నుంచి అటు రాకూడదని నిర్ణయించుకున్నాను. ఉంటాను.

ఇట్లు

ఉష.

ఇది చదివి పెద్దగా నవ్వుకున్నాడు. ఇంత చిన్న విషయానికా తను నన్ను ప్రక్కన పెట్టింది. తను కోరుకుంది ఆమె సాన్నిహిత్యమే కాని శరీరం కాదు. ఆమెకి ఏమైనా ఉండవచ్చు. కాని ఆమె స్నేహానికి కాదుగా అనుకుని ఈ వ్యాధితో బాధపడే వాళ్ళు అంతా ఇలాగే నిస్పృహతో ఆలోచిస్తారేమో అనుకొని,

హృదయాలకు ఎయిడ్స్ వచ్చి కామ పిశాచాల్లా తిరుగుతున్న వారూ, శరీరాన్ని అమ్ముకుని జీవనం సాగిస్తున్నవారు. వావివరుసలు లేకుండా కామకూటంలో విలవిలలాడుతున్నవారు ఎందరో ఈ సమాజంలో జీవిస్తుండగా తప్పు చేయకుండా పరులకు మంచి చేయాలని ఆశించే ఆమె మనసు ఎంతో మంచిదని తెల్సుకుని, ఆ ఊరూ, పేరూ తెలియని నేస్తం కోసం హాస్పటల్‌కి వెళ్ళాడు.

మరుసటి రోజు ఆ దారివెంట ఓ జంట నడుచోస్తుంది. సూర్యచంద్రుల మధ్య, దివికి భువికి మధ్య వున్న స్వచ్ఛమైన స్నేహానికి నిదర్శనాలే ఆ ఉష, ఉదయ్‌లు.

"అంగవైకల్యమైనా, అనారోగ్యమైనా శరీరానికే కాని మనసుకు కాదు. మంచి హృదయం కోరుకునేది స్నేహాన్నే కాని శరీరాన్ని కాదు".

ఇది అంతం కాదు ఆరంభం.


## శుభాకాంక్షలు ఇలా....

పుట్టినరోజు, వివాహ, పదవీ విరమణ శుభాకాంక్షలు,ఇతర విషయ సమాచారాలు చినుకులో ప్రకటనల ద్వారా తెలపాలనుకునేవారు ముందుగా ఫోటోతో సహా వివరాలను చినుకు కార్యాలయానికి రూ။200/-లు ఎం.ఓ ద్వారా పంపండి. ప్రకటన పడిన సంచికను మీతో పాటుగా మీరు కోరిన ఐదుగురికి పోస్టుద్వారా పంపడం జరుగుతుంది.